క్లుప్తంగా

గొల్లనపల్లిలో 'చదవడం మాకిష్టం'

గన్నవరం రూరల్: గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కేఎస్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో పుస్తక దాతలు, అతిథులకు సత్కారం జరిగింది. మాజీ ఏఎంసీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, సర్పంచ్ గణపవరపు శాంతి, ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకులు వెంకట్రావు, పీఎంసీ చైర్మన్ ప్రసాద్, సీతారామారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాకులపాడులో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కాకులపాడులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను నాంది ఫౌండేషన్ నిర్వహించనుంది. సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ చిన్నా పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ టీవీ సతీష్ కోరారు. కంకిపాడు పట్టణంలో నిర్మించిన గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘ భవనం పునఃప్రారంభాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సందీప్, మండల అధ్యక్షుడు కె.ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బొకినాల

హనుమాన్‌జంక్షన్ రూరల్: వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లవల్లికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొకినాల సాంబశివరావు, మహిళా విభాగం (మాతృశక్తి) జిల్లా అధ్యక్షురాలిగా జంక్షన్‌కు చెందిన విజయలక్ష్మి నియమితులైయ్యారు. గత నెల 30న మచిలీపట్నంలో జరిగిన వీహెచ్‌పీ జిల్లా సమావేశంలో నియామకాలు జరిగినట్లుగా శుక్రవారం వారు తెలిపారు.

నేడు బాపులపాడు మండల పరిషత్ సమావేశం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. మహాత్మాగాంధీనగర్‌లోని వైఎస్సార్ క్రాంతి పథం మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు.



గోసాలలో పసుపు పంటను పరిశీలిస్తున్న రైతు



పోరంకిలో ..

పంట సంరక్షణలో రైతుల నిమగ్నం

మండల పరిధిలో పోరంకి, గోసాల, గంగూరు, వణుకూరు, తాడిగడప ప్రాంతాల్లో పలు పంటలు.. అకాల వర్షాల కారణంగా తడిసిపోయాయి. వరి, పసుపు, జొన్న, మొక్కజొన్న పంటలు కల్లాల్లో ఉన్న సమయంలో వర్షాలు పడటం.. అవి తడవటంతో రైతులు చాలా ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఎండ రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో పంట సంరక్షణలో రైతులు నిమగ్నమయ్యారు. పంటలను ఎండబెడటానికి రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. పంట నష్టంపై ఎన్యూమరేషన్ చేస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందితో సహకరించాలని వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ అన్నారు.

–పెనమలూరు

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

ఉయ్యూరు: స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంభన సాధించవచ్చని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. ఉయ్యూరు ప్రధాన సెంటరులో మెప్మా ఆధ్వర్యాన స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాల స్టాళ్లను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మా ప్రతినిధులు వెంకయ్య, జోత్స్న పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: ఇంటర్ విద్యార్థి అదృశ్యం కావడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బంటుమిల్లి మండలం అత్తమూరు గ్రామానికి చెందిన నల్లూరి శ్రీరామమూర్తి కుమారుడు నల్లూరి తరుణ్‌ప్రకాష్ పోరంకిలోని ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివి రెండో ఏడాదిలోకి వచ్చాడు. అయితే మొదటి సంవత్సరం పరీక్షల మార్కులు తక్కువగారావటంతో తండ్రి ఫోన్‌లో మందలించాడు. దీంతో ఈ నెల 3న కాలేజీ అవుటింగ్ ఇచ్చిన సమయంలో తరుణ్‌ప్రకాష్ కాలేజీ నుంచి బయటకు వచ్చి అదృశ్యమయ్యాడు. కుమారుడి అదృశ్యంపై తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

గన్నవరంరూరల్: ఏసు మార్గం అనుసరణీయమని బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు భక్తులకు సందేశమిచ్చారు. శుక్రవారం రాత్రి మండలంలోని కొండపావులూరులో మూడు రోజులుగా జరుగుతున్న పునీత బాప్తిస్మ యోహాను దేవాలయం లూర్దుమాత మహోత్సవాలు ముగిశాయి. విచారణ గురువులు స్లీవరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, సహకార బ్యాంకు చైర్‌పర్సన్ కంచర్ల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మకు లక్ష పుష్పార్చన

గన్నవరం: పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం లక్ష మల్లెపూలతో పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుక చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గన్నవరం రూరల్: సూరంపల్లి శివారు రామచంద్రాపురంలో శుక్రవారం శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ, ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగాయి.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెనమలూరు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఏపీ బ్యాడ్మింటన్ కార్యదర్శి డాక్టర్ అంకమ్మచౌదరి అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం క్రీడ, సాంస్కృతిక దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, పీడీ సాంబశివరావు, డాక్టర్ రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోండి

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని సందర్శించారు. వేసవి శిబిరం ఇన్‌చార్జ్ ధనియాల నాగరాజు, వ్యాయామోపాధ్యాయులు కె.టాన్యాగిరి తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయశాఖ ఉన్నతాధికారులు గత నెల 30న నోటిఫికేషన్ జారీ చేశారని ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి నూతక్కి వెంకట సాంబశివరావు శుక్రవారం తెలిపారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పండు ఈగ నివారణకు చర్యలు తీసుకోండి

గన్నవరం రూరల్: మామిడి తోటల్లో పండు ఈగ నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవన శాఖాధికారి ఇ.హరిచంద్ చెప్పారు. శుక్రవారం మండలంలోని మాదలవారిగూడెం, సూరంపల్లి, చనుపల్లివారిగూడెం గ్రామాల్లో ఉన్న మామిడి తోటలను ఆయన పరిశీలించారు. హార్టికల్చర్ అసిస్టెంట్ దీక్ష, వీఏఏ రవితేజ పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి కొత్త పింఛన్ అందజేత

ఉయ్యూరు: డయాలసిస్ రోగులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేలు పింఛను ఉపయుక్తంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. కొత్తగా మంజూరైన డయాలసిస్ పింఛనును శుక్రవారం చైర్మన్ నాని లబ్ధిదారుకు అందించారు. వైస్ చైర్మన్ సోలే సురేష్ బాబు, కౌన్సిలర్ గోన మదన్, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై అవగాహన

పెనమలూరు: వణుకూరులో శుక్రవారం సచివాలయం1లో గృహనిర్మాణ లబ్ధిదారులకు ఎంపీడీఓ సునీతాశర్మ అవగాహన కల్పించారు.

కంకిపాడు: ఈడుపుగల్లులో లబ్ధిదారు కుటుంబాలతో కలిసి వైఎస్సార్ సీపీ జిల్లా నేత వి.శ్రీనివాసరావు గృహ నిర్మాణాల శంకుస్థాపనలు చేశారు.

రైతుల శ్రేయస్సే 'సహకార' లక్ష్యం

ఉంగుటూరు: రైతు శ్రేయస్సే సహకార సంఘాల లక్ష్యమని కేడీసీసీ ఉంగుటూరు బ్యాంక్ మేనేజర్ ఎం.సాంబశివరావు అన్నారు. ఆముదాలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. చైర్‌పర్సన్‌గా గుత్తా పూర్ణచంద్రరావు, సభ్యులుగా సాంబశివరావు, దుర్గాప్రసాద్ కొత్తగా నియమితులయ్యారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ప్రసాద్, మాజీ చైర్‌పర్సన్ దాసరి జయప్రసాదరావు, పాతూరి బాపూజీ, డొక్కు వెంకటస్వామి, నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సాధించాలి

పెనమలూరు: నైపుణ్యాభివృద్ధిపై దృష్టిపెట్టాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలోని సీఎం స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్, సీమెన్స్, లాబ్స్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గన్నవరం: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్రసేవ పథకంలో భాగంగా ముస్తాబాదకు చెందిన జైహనుమాన్ సీహెచ్‌సీ గ్రూపునకు ప్రభుత్వం రాయితీపై అందజేసిన కోత మిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ యంత్ర సేవ పథకంలో భాగంగా ప్రతి ఆర్బీకే పరిధిలో రైతులకు రాయితీపై ట్రాక్టర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. రూ. 25 లక్షల కోత మిషన్‌ను ప్రభుత్వం 40 రాయితీ కింద రూ. 8.60 లక్షలు, రైతుల వాటా పది శాతం, మిగిలిన 50 శాతం బ్యాంక్‌ల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కోత మిషన్‌కు నలుగురు నుంచి ఐదుగురు రైతులు గ్రూపుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారిణి తేజస్వి, ముస్తాబాద పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ చౌదరి, వీఏఏలు, జైహనుమాన్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణమస్తుతో ఆర్థిక తోడ్పాటు

ఉంగుటూరు: కల్యాణమస్తు, షాదీ తోఫాలతో పేదలకు ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. నాగవరప్పాడు ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు రూపొందించి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా 16మందికి రూ.11.20లక్షలు వధువు తల్లి బ్యాంకు ఖాతాలో నగదు జమయ్యాయని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ కేక్ కోసి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



కల్యాణమస్తు కేక్ కోస్తున్న ఎమ్మెల్యే వంశీ

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: తాడిగడపలో అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకోవటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప యలవర్తి హైట్స్‌కు చెందిన సంగా ప్రసాద్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అతని తల్లిదండ్రులు కృష్ణబాబు(52), లీలాలక్ష్మి తాడిగడపలో ఉంటారు. కృష్ణబాబు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత నెల 30న కృష్ణబాబు ఇంటి నుంచి బయటకు వెళ్లి కలుపు మందు తాగాడు. కుటుంబసభ్యులు అతన్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న కృష్ణబాబు శుక్రవారం మృతి చెందాడు.